ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 264
పేజీలు : 5 వెల రూ. 2/-

గురువారం
23 అక్టోబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## బంగారం వెండి ధరల్లో దిద్దుబాటు

- బంగారం 9వేలు వెండి 7వేల తగ్గుదల..



## భారత్‌పై సుంకాలు తగ్గించే యోచన

- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై అమెరికా ఆసక్తి



## బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్లా..?

దౌర్భగ్యస్థితి కాంగ్రెస్ సర్కారు : బండిసంజయ్ ఫైర్



## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

- బిసి రిజర్వేషన్లు..
స్థానిక ఎన్నికలపై చర్చ
- కీలక నిర్ణయాలు
తీసుకునే అవకాశం



# రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి పూర్తి

- ఆధునిక పద్ధతుల్లో అవసరాల మేరకు నిర్మాణాలు
- ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికారలు సిద్ధం చేయాలి
- ప్రజలకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు



## తెలంగాణ రవాణా

# చెక్ పోస్టుల ఎత్తివేత

- సిఎం ఆదేశాలతో తక్షణ చర్యలు
- ఆగమేఘాలమీద రవాణా శాఖ నిర్ణయం
- నంబర్ ప్లేట్ రికగ్నేషన్ అమలు
- రవాణాశాఖలో ఎఐ సాంకేతికత అమలు
- షోరూముల్లోనే వాహన రిజిస్ట్రేషన్ల పరిశీలన
- ఢిల్లీ కాలుష్యం దృష్ట్యా
హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి
- అధికారులతో సమీక్షించిన
మంత్రి పొన్నం ప్రభాకర్..

వివరాలు 2లో..



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
## కోదండరామ్
## మద్దతు కోరిన పిసిసి చీఫ్

- దానం బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు
- మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



# రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి పూర్తి

ఏఎం న్యూస్, హైదరాబాద్,అక్టోబర్22: గోషామహల్ వద్ద చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించు కుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక సదుపాయాలు కల్పించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# తెలంగాణ రవాణా చెక్ పోస్టుల ఎత్తివేత

ఏఎం న్యూస్, హైదరాబాద్,అక్టోబర్22: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించు కోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలుసంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులను ఎత్తివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) అనే అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్?డ్ కెమెరా సిస్టమ్ హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో ఉన్న ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనున్నది. అయితే, ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వెహికల్ అయినా కెమెరా కండ్లుగప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే.. వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్ లను కూడా రంగంలోకి దింపనున్నారు. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ చేసే వాహన యజమానుల అసోషియేషన్ కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించ నున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ ముందే ఆన్ లైన్ లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతుల్లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటి వరకు 15 చెక్ పోస్టుల అంతరాష్ట్ర చెక్ పోస్టుల దగ్గర విధుల్లో ఉన్న సుమారు 70 మంది ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఇతర సిబ్బందిని ప్రస్తుతం రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించనున్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారులపై రవాణా సమస్యలు లేకుండా, సాఫీగా ప్రయాణం జరిగేందుకు వీలుగా చెక్ పోస్టులను ఎత్తేయాలని గతంలోనే కేంద్రం ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.

దిల్లీలో కాలుష్యం ఎలా ఉందో అందరం చూస్తూనే ఉన్నామని.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి. వాహన సారథి పోర్టల్‌ను పూర్తిగా అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.70 కోట్లకు చేరింది.

షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తేనే.. ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందని మంత్రి పొన్నం అన్నారు. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ చెక్‌పోస్టులను తక్షణమే మూసివేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీఏ చెక్ పోస్టుల రద్దు చాలా పెద్ద నిర్ణయమని పేర్కొన్నారు. చెక్ పోస్టుల విషయంలో మరింత పారదర్శకత తీసుకొస్తామని.. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న ఆర్టీఏ చెక్ పోస్టులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆర్టీఏ కార్యాలయంలో సిమ్యులేటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రవాణా వ్యవస్థలో ఏఐ సేవలు మరింత వినియోగిస్తామని స్పష్టం చేశారు. బుధవారం రవాణా శాఖపై సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం ఏ విధంగా ఉందో అందరం చూస్తున్నామని.. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దని అన్నారు. ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు, ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని.. రూల్స్ అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీలు ఇస్తున్నామని.. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనాల స్క్రాపింగ్ విషయంలో కొత్త పాలసీ తీసుకొస్తున్నామని చెప్పారు. వాహనాల స్క్రాపింగ్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు యోచిస్తున్నామన్నారు.

## 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది

### – ఇరికి మహేష్ జిల్లా ఉపాధ్యక్షుడు యువజన కాంగ్రెస్ పెద్దపల్లి..

ఏఎం న్యూస్ / హైదరాబాద్ : రామగుండం అభివృద్ధి ప్రదాత శాసనసభ్యుడు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ ఆదేశాల మేరకు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో 66.8 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేసి సాగు చేయడం జరిగింది. అందులో భాగంగా 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్పత్తి చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వాన్ని. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి కొనుగోలుకు 23 వేల కోట్ల రూపాయల్ని బుధవారం విడుదల చేయడం జరిగింది. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డ వార్డులు అలాగే 40 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వార్డులు 500 బోనస్తో ఈరోజు ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న శుభసందర్భం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 8342 కొనుగోలు కేంద్రాలను 4259 ప్రాథమిక వ్యవసాయ శాఖ ద్వారా 3517 ఐకెపి సెంటర్ అలాగే 56 ఇతర కేంద్రాల ద్వారా ఈరోజు వడ్లు కొనుగోలు చేయబోతున్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా గతంలో 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసిన చరిత్ర ఈరోజు గౌరవ మంత్రి గారు శ్రీధర్ బాబు గారి నాయకత్వంలో శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ అలాగే విజయ రమణారావు నాయకత్వంలో ఈరోజు జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం ఉత్పత్తి చేయడం జరిగింది. పెద్దపల్లి జిల్లాకి సంబంధించిన మాజీ శాసనసభ్యులు ముగ్గురు అందులో కోరుకంటి చందర్, పుట్టా మధు, దాసరి మనోహర్ రెడ్డి సత్య దూరమైన మాటలు కాంగ్రెస్ పార్టీపై మాట్లాడిన సందర్భాలు అనేకం ఈరోజు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తో సంబంధం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మెట్రిక్ట టన్నులు, జిల్లా వ్యాప్తంగా 40,000 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేసిన చరిత్ర ఈరోజు కాంగ్రెస్ పార్టీది ఈ విషయాన్ని ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యేలు గుర్తు ఎరుగాలని వారికి భగవంతుడు సద్బుద్ధి ప్రసాదించాలని ఈ సందర్భంగా తెలియ జేస్తున్న.



# రాజకీయాలూ.. నైతికవిలువలు

### – ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ వైస్ ప్రెసిడెంట్ జమాత్ ఇ ఇస్లామీ హింద్, టెహ్రీక్ కౌన్సిలర్, హింద్ మజ్దూర్ సభ HMS జాతీయ కార్యదర్శి

ప్రాధానమంత్రి నరేంద్రమోడీ చీపురుపట్టిన ప్రతీరునాకు బాగానచ్చింది. అందుకే ఈసుప్రభాత సమయాన బేషరతుగా బీజేపీలో చేరిపోతున్నా.. రాహుల్ చెయ్యి ఊపినట్లు ఊపడం ఎవరివల్లాకాదు. అదినాకు ఎంతగా నచ్చిందంటే, ఉదయం కమల తీర్థం పుచ్చుకున్న సంగతే మరచి పొయ్యా. అందుకే ఈశుభ మధ్యాహ్నం కాంగ్రెస్ లో చేరిపోతున్నా... కారు కేసీఆర్ నడిపినట్లుగా మరెవ్వరూ నడపలేరు.ఆడ్రైవింగ్ నాకు అమితంగా నచ్చింది. కమల, హస్తాలు తరువాత సంగతి. ఈచల్లని సాయంత్రం, ఈ క్షణాన్నే గులాబీ తీర్థం పుచ్చుకుంటున్నా.. చంద్రబాబు సైకిల్ నడిపినట్లు ఎవరైనా నడపగలరా? ఎంతముద్దుగా నడువుతాడో..! ఆయన సైకిలే ఎక్కేస్తా... కోదండరాం సార్ కూడా మంచోడే.. రాత్రికి ఏమైనా కల వస్తే ఉదయాన్నే టీ జే ఎస్ కండువా కప్పుకుంటా.. ఇదిగో ఇదీ. ఇలాఉంది. ప్రస్తుతం దేశంలో రాజకీయాల పరిస్థితి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో.. ప్రస్తుతం తెలంగాణలో.. ఒకే వ్యక్తి ఉదయం ఒక పార్టీ, మధ్యాహ్నం ఒక పార్టీ, సాయంత్రానికి మరొక పార్టీ. రాజకీయాల్లో నైతిక విలువల పతనానికి ఇది పరాకాష్ట ఇక అసలు విషయంలోకొస్తే.. కాంగ్రెస్ పార్టీమ్యానిఫెస్టో కమిటి చైర్మెన్, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ సతీమణి శ్రీమతి పద్మినీ రెడ్డి ఇ కిందటి వారం భారతీయ జనతా పార్టీలో చేరారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీచేపట్టిన కార్యక్రమాలు తెగ నచ్చేసి ఆమె కమల తీర్థం పుచ్చుకున్నారట. భా.జ.పా అవకాశం ఇస్తే సంగారెడ్డి నుండి పోటీచేస్తానని కూడా ప్రకటించారామె. మీడియాతో సహా, బీ జే పీ లోని కీలకమైన నాయకులకు కూడా తెలియకుండా అత్యంత గోప్యత పాటించి, భా.జ.పా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ శుభకార్యంలో భా.జ.పా నేతలు, పద్మినీరెడ్డి సామాజిక సేవాకార్యక్రమాలను తెగపొగిడేశారు. సేవారంగంలో ఆమెకున్నమంచిపేరును తాము నూటికి నూరుశాతం సద్వినియోగంచేసుకుంటామని ఊహానంద లోకాల్లో తేలిపోతూ ప్రకటించారు. కాని ఆ ఆనందం ఎంతోసేపు నిలువలేదు. కొన్నిగంటల వ్యవధిలోనే పద్మినీ రెడ్డిమనసు మార్చుకొని భా.జ.పా నేతల ఆశలపై నీళ్ళుచల్లారు. భర్త దామోదర రాజనరసింహ ఫోన్ చేసి, కాంగ్రెస్ పార్టీలో తన స్థాయినీ, స్థానాన్నీ, హోదాను, ప్రస్తుతం మ్యానిఫెస్టో కమిటీకి చైర్మెన్ గా ఉన్న విషయాన్నీ " ఏకరువుపెట్టి పరువు తీయవద్దని వేడుకున్నాడట. ఇంటిగుట్టు రచ్చకెక్కితే ప్రజల్లో పలచనై పోతామని, దయచేసి మారు మనసు పొందమని కన్నీటి ప్రార్థనచేశాడట. వందలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు రక్తార్పణం చేస్తామని హెచ్చరికలు చేయడం, పార్టీ పెద్దలు రకరకాలుగా బుజ్జగించి, 'మేమున్నామ'ని భరోసా ఇవ్వడంతో లాభనష్టాలు బేరీజు వేసుకొని మళ్ళీ చేతిలో చెయ్యివేశారట పద్మినీరెడ్డి. ఇది కేవలం ఒక్క పద్మినీ దామోదరీయ నాటకం మాత్రమేకాదు, – ఈరోజు రాష్ట్ర రాజకీయ యవనికపై నడుస్తున్న చరిత్ర. తెలంగాణలో కేసీ ఆర్ ఆంధ్రాలో చంద్రబాబు ఇలాంటి రాజకీయ నాటకాన్నేకదా రక్తికట్టించింది. నిజానికి తెలంగాణలో టీ ఆరెస్ నుండి శాసనసభకు ఎన్నికైంది కేవలం 63 మంది సభ్యులు మాత్రమే. మరి ఆసంఖ్య 90 కి పైగా ఎలా ఎగబాకింది? తెలుగు దేశం పార్టీలో సైకిల్ గుర్తుపైగెలిచిన శాసనసభ్యుడు టీ ఆర్ ఎస్ ప్రభుత్వంలో మంత్రి ఎలా కాగలిగాడు. ఈపరిణామాన్ని గవర్నర్ వ్యవస్థ ఎలా ఆమోదించగలిగింది? అదేవిధంగా టీ అరెస్ సభ్యులను తెలుగుదేశం కొనుగోలుచేయడానికి నిజంకాదా? ఏమిటి దంతా..? ప్రయత్నించడం, పట్టుబడడం తెలంగాణాలో తె.దే.పా శాసనసభ్యులను టీఆరెస్ తమపార్టీలోకి లాక్కున్నప్పుడు ఆ రెస్ రాజకీయ వ్యభిచారానికి పాల్పడుతోందని, సంతలో ఈనీతి పశువులను కొన్నట్లు కేసీఆర్ తె.దే.పా ఎమ్మెల్యేలను కొంటున్నాడని తీవ్రంగా తప్పుపట్టిన చంద్రబాబు,ఆంధ్రాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొన్నప్పుడు బాబుకు గుర్తుకురాలేదా? ఏనోటితోనైతే సంతలో పశువుల్ని కొన్నట్లు తమ ఎమ్మెల్లేలను కేసీఆర్ కొన్నాడని చంద్రబాబు అన్నాడో, అదే నోటితో స్వయంగా వై సీ పీ ఎమ్మెల్యేలను ఆహ్వానించి ప్యాకేజీలు, మంత్రి పదవులు ఇవ్వలేదా? ఇది నిజం కాదా? ఇది అనైతికం కాదా? ఇదిరాజకీయ వ్యభిచారంకాదా? పిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులిచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేయడంకాదా? ఎవరికివారు తాము చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తేతప్పు, తాముచేస్తే సంసారం, ఇతరులు చేస్తే వ్యభిచారం అంటున్నారు తప్ప, సహేతుకమైన, ప్రజాస్వామ్యబద్ధమైన, రాజ్యాంగ పరమైన విధానాన్ని అవలంబించడం లేదు. ఏ పార్టీ చూసినా ఏమున్నది గర్వకారణం. నైతిక విలువలకు తిలోదకాలిచ్చి అధికారమే పరమావధిగా పావులు కదుపుతున్న అనైతిక రాజకీయాలు తప్ప. అధికారంలోకి రావడానికి, అధికారాన్ని కాపాడుకోడానికి ఎంచుకునే వక్రమార్గాలను, అనైతిక విధానాలను రాష్ట్ర పయోజనాల కోసమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేందుకని, విధిలేని పరిస్థితుల్లోనే ఇలాంటి తప్పుడు పద్ధతులు అవలంబించాల్సి వస్తోందే తప్ప మరో ఉద్దేశం లేదని నేతలు పనికిమాలిన నీతి భాష్యాలు చెబుతున్నారు. ఇదంతా చూస్తుంటే, రాజకీయ నేతలందరూ తమతమ స్వార్థ ప్రయోజనాలకోసం, ప్రజా సంక్షేమాన్ని పణంగా పెట్టి, విలువలకు పాతరేసి ప్రజలను పావులుగా వాడుకుంటున్నారని స్పష్టంగా అర్థమవుతోంది. కేవలం తమ పబ్బం గడుపుకోడానికి ప్రజల భావోద్రేకాలతో అడుకుంటూ, వాళ్ళను వెర్రివెంగళప్పలను చేస్తూ, కూరలో కరివేపాకులా వాడుకొని అవతల పడేస్తున్నారని ఇట్టే తెలిసిపోతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రజలే చైతన్యవంతంకావాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో ఏదో ఒక ఆశ చూపి, ప్రలోభాలకు లోనుచేసి తమ పబ్బం గడుపుకోవచ్చన్న రాజకీయ నాయకుల ఆలోచనా విధానం తప్పని నిరూపించాల్సిన అవసరం ఉంది. స్వల్ప మూల్యానికి తమ ఓటును అమ్ముకోకుండా సామాన్యులను చైతన్యం చేయడానికి అవగాహన కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి. ఓటు హక్కు వినియోగంపట్ల అవగాహన కల్పించాలి. ఈ విషయంలో యువకులు, మహిళలు ఒక మంచి నిర్ణయం తీసుకోగలిగితే రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశం ఉంది. మొత్తంగా రాజకీయాల్లో నైతిక విలువలు పెంపొందించడానికి పౌరసమాజమే ఒక విప్లవాన్ని తీసుకురావాలి.



# భారత్‌పై సుంకాలు తగ్గించే యోచన

ఏఎం న్యూస్, వాషింగ్టన్,అక్టోబర్22: సుంకాలను తగ్గించేందుకు భారత్ అమెరికాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుంది. దీర్ఘకాలంగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందానికి భారత్–అమెరికాలు చాలా దగ్గరగా ఉన్నాయని, దీంతో భారత దిగుమతులపై అమెరికా సుంకాలు 50శాతం నుండి 15 నుండి 16శాతానికి తగ్గనున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంధనం, వ్యవసాయంపై ఆధారపడిన ఈ ఒప్పందంతో, క్రమంగా భారత్ రష్యా నుండి ముడి చమురు దిగుమతులు తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపాయి. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఈ అంశంపై బుధవారం జాతీయ మీడియాలో ఒక కథనం ప్రచురితమైంది. అమెరికాతో చర్చల్లో భాగంగా, జన్యుపరంగా మార్పులు చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచడానికి భారత్ అనుమతించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొంది. ఈ ఒప్పందంలో సుంకాలు మరియు మార్కెట్ యాక్సెస్‌ను క్రమానుగతంగా సమీక్షించే యంత్రాంగం కూడా ఉండవచ్చని తెలిపింది. ఈ నెలలో జరగనున్న ఏసియన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వైట్‌హౌస్ స్పందించాల్సి వుంది. మంగళవారం భారత ప్రధాని మోడీతో మాట్లాడానని, ఎక్కువగా వాణిజ్యంపై దృష్టిసారించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇంధనంపై కూడా చర్చలు జరిపామని ఆయన అన్నారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లను పరిమితం చేస్తుందని మోడీ తనకు హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారు. అయితే ట్రంప్, తాను చర్చలు జరిపామని మోడీ కూడా స్పష్టం చేశారు. చర్చలకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు.

# బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?

ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్22: పెండింగ్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ లాగా సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతరత్రా పెండింగ్ బిల్లులు చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్ అయ్యారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలరాస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. బకాయిలు చెల్లించాల్సిందే అంటూ పట్టుబడిన బండి సంజయ్.. ప్రభుత్వానికి పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్ మెయిల్ చేస్తారా? విద్యార్థులు, యాజమాన్యాల భవిష్యత్తుతో చెలగాటమాడతారా? బ్లాక్ మెయిల్ చేస్తే చూస్తూ ఊరుకుంటామా? కమీషన్లు రావనే సాకుతో బకాయిలు చెల్లించడం లేదా? అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని కూడా కాలరాస్తారా? పదేపదే ఇచ్చిన మాటను తప్పే వాళ్లను ఏమనాలి? బీహార్ ఎన్నికలకు పైసలు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా? విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? ఈసారి తక్షణమే బకాయిలు మొత్తం చెల్లించాల్సిందే.. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు' అంటూ హెచ్చరించారు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయమని వార్నింగ్ ఇచ్చారు. యాజమాన్యాలూ..... ప్రభుత్వానికి భయపడి సమ్మె విరమిస్తే అంతే సంగతులు.. భవిష్యత్తులో ఎవరూ అండగా నిలబడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలపైనా రోడ్డెక్కడం తథ్యమని వెల్లడించారు. మంత్రులు ప్రతి పనికి కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ సొమ్మును కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతున్నారంటూ బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగా.. ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని నల్లకుంట శంకర్‌మఠ్‌కు చేరుకున్న బండి సంజయ్.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రుంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులను కేంద్రమంత్రి అందుకున్నారు.

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్22: తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్‌పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది ఆసక్తిగా మారింది.

# బంగారం వెండి ధరల్లో దిద్దుబాటు

ఏఎం న్యూస్, హైదరాబాద్,అక్టోబర్22: రికార్డు ధరలతో ఇటీవల ఆకాశాన్నంటిన బంగారం, వెండి ధరలు తాజాగా దిగొస్తున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం పసిడి ధర భారీగా పడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.9 వేలకు పైగా తగ్గడం గమనార్హం. అటు వెండి ధర కూడా దిగొచ్చింది. బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 గ్రాముల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,25,250కి పడిపోయింది. 22 క్యారెట్ల ధర రూ.1,14,843గా ఉంది. ఇక వెండి ధర దాదాపు రూ.7వేలు తగ్గింది. నేడు కేజీ వెండి ధర రూ.1,58,000 పలుకుతోంది. వెండి ధర వారం రోజుల్లో దాదాపు రూ.28వేలు తగ్గింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,022 డాలర్లకు పడిపోయింది. వెండి ధర 47.84 డాలర్లకు చేరింది. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికాడాలర్ బలోపేతంకావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్తఉపశమించడంఇందుకుకారణమనిబులియన్‌వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోదండరామ్ మద్దతు కోరిన పిసిసి చీఫ్

ఏఎం న్యూస్, హైదరాబాద్,అక్టోబర్22: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం తెలంగాణ జన సమితి (టీజేఎస్) కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌ను కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలన్న అంశంపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కోదండరామ్‌తో జరిగిన సమావేశం అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావంలో కోదండరామ్ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆయన నిస్వార్థంగా, నిజాయితీతో రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలా నిరంకుశంగా మారిందో అందరికీ తెలుసని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ పాలన నుంచి విముక్తి కోసం కాంగ్రెస్, టీజేఎస్ సహా ప్రజాసంఘాలన్నీ కలిసి 2023 ఎన్నికల్లో పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో టీజేఎస్ సహకారం ఎంతో విలువైనది. దాన్ని మేము ఎప్పటికీ మరవం,' అని తెలిపారు. ఉద్యోగ నియామక రూపకల్పనలో కోదండరామ్ సలహాలు, సూచనలు ఎంతో విలువైనవని మహేష్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగుతుందని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో యువ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీజేఎస్‌ను కోరారు. సీపీఐ, సీపీఎం, ఏఐఎంఐఎం మాదిరిగా టీజేఏసీ మద్దతు కూడా కోరినట్లు తెలిపారు. ఇక బీజేపీ నేతలపై తీవ్రంగా విరుచుకుపడ్డ ఆయన? 'కేంద్రమంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో తనకే అర్థమవుతున్నదా? మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్లు రాజేసి లబ్ది పొందాలన్నదే బీజేపీ పన్నాగం,' అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. మిత్రపక్షాలతో ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతుందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వివాదం ముగిసిపోయిందని క్లారిటీ ఇచ్చారు. టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ తాజాగా మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మా స్టార్ క్యాంపెయినర్ లిస్టులో దానం నాగేందర్ పేరు ఉంటే తప్పేంటి?. ముసుగులో గుద్దులాటలు అవసరం లేదు.. దానం నాగేందర్ సపోర్ట్ డైరెక్ట్ చేస్తున్నాడు. మా పార్టీకి మద్దతు ఇస్తే తప్పేంటి?. ఫిరాయింపుల అంశాన్ని స్పీకర్ చూసుకుంటారు. జీవన్ రెడ్డి చాలా రోజుల నుంచి అసంతృప్తితో ఉన్నారు. జీవన్ రెడ్డితో త్వరలోనే మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కొండా సుస్మిత వ్యాఖ్యలపై కొండా దంపతులు విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మళ్ళీ ఇలాంటివి జరగవని కొండా దంపతులు ముఖ్యమంత్రితో చెప్పారు. కొండా సురేఖ వివాదం ముగిసింది. రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను ఢిల్లీ వెళ్తాం. డీసీసీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తాం' అని చెప్పుకొచ్చారు.

# ఓయూలో పీహెచ్.డి ప్రవేశం పొందిన పోగాకు అరవింద్ కుమార్‌కు
# దలిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్ డి.బి.ఎస్.ఏ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ఏ ఎం న్యూస్ ఓయూ:



ఉస్మానియా విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్.డి ప్రవేశం సాధించిన ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రతిభావంతుడు డి.బి.ఎస్.ఏ విద్యార్థి నాయకుడు పోగాకు అరవింద్ కుమార్‌కు దలిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్-డి.బి.ఎస్.ఏ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఘన సన్మానం నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమాన్ని డీ.బీ.ఎస్.ఏ రాష్ట్ర కోఆర్డినేటర్, పీహెచ్.డి రీసెర్చ్ స్కాలర్ జంగిలి దర్శన్ సమన్వయం చేస్తూ, గ్రామీణ ప్రాంతాలనుంచి విద్యా శిఖరాలకు చేరుకోవడం అరుదైన సాధన అని, అరవింద్ కుమార్ విజయంతో పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు గొప్ప ప్రేరణ లభించిందని, డీ.బీ.ఎస్.ఏ తరపున ఆయన భవిష్యత్తు మరింత వెలుగొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ సోశాలజీ డిపార్ట్మెంట్ డా. తిరుపతి , ప్రముఖ ఆర్థికవేత్త ఓయూ రీసెర్చ్ స్కాలర్ ప్రభాకర్ చౌటి , మహాజనగళం వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ మహాజన, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకుడు రాజేష్, గిరిజన నాయకుడు సురేష్, డీ.బి.ఎస్.ఏ నాయకులు రాజు, ప్రశాంత్ తదితరులు పోగాకు అరవింద్ కుమార్ సాధించిన ఈ విజయం గ్రామీణ విద్యార్థులకు కొత్త దిశ చూపే ప్రేరణాత్మక ఘట్టమని, తల్లిదండ్రుల కష్టం, పట్టుదల, క్రమశిక్షణ, చదువు పట్ల ఉన్న అభిరుచి కలిసి ఇంతటి విజయానికి దారితీశాయని, సాధనతోనే సార్థకతను చేరుకోవచ్చని ఆయన నిరూపించాడని, భవిష్యత్తులో సివిల్ మరియు స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రంగంలో విలువైన పరిశోధనలు చేసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని, యువతకు ఆదర్శంగా నిలవాలని శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం పోగాకు అరవింద్ కుమార్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్.డి ప్రవేశం పొందడం తన జీవితంలో ఒక గొప్ప మైలురాయిగా భావిస్తూ, చిన్నప్పటి నుంచీ ఎన్నో సవాళ్లు ఎదురైనా పట్టుదల, క్రమశిక్షణ, ఓపికతో ముందుకు సాగిన ఫలితమే ఈ విజయం అని, చదువు ద్వారానే మన జీవితాన్ని, మన సమాజాన్ని మార్చగలమనే నమ్మకంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపాడు. తన చదువులో సహకరించిన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, గురువులకు,డీ.బీ.ఎస్.ఏ సంఘానికి ,నా శ్రేయోభిలాషులకు,ప్రతి ఒక్కరికి పేరు పేరున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.బి.ఎస్.ఏ స్టేట్ కో ఆర్డినేటర్ జంగిలి దర్శన్, డా. తిరుపతి, ప్రముఖ ఆర్థికవేత్త ఓయూ రీసర్చ్ స్కాలర్ ప్రభాకర్ చౌటి, మహాజన గళం వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ మహాజన,స్వేరో స్టూడెంట్ యూనియన్ రాజేష్,డి.బి.ఎస్.ఏ నాయకులు రాజు మహేష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## ఓయూ అధ్యాపకుల నిరసనలు కొనసాగింపు
### వాట్సాప్ గ్రూపులో ప్రొఫెసర్ వెంకటదాసు కరపత్రం వ్యక్తిగతం ఔటా అధ్యక్షుడు మనోహర్ స్పష్టం

ఏ ఎం న్యూస్ ఓయూ:



ఉస్మానియా యూనివర్సిటీలో ప్రమోషన్ల విషయంలో జరిగిన అన్యాయంపై నిరసనలు కొనసాగుతాయని ఔటా అధ్యాపకులు స్పష్టం చేశారు. బుధవారం కెమిస్ట్రీ విభాగం ఎదుట జరిగిన నిరసనలో ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ మాట్లాడారు. అధ్యాపకులు ప్రతిరోజూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై ఇప్పటికే వర్సిటీ వైస్ చాన్సలర్‌కి లేఖ అందజేశామని, ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లు ఎందుకు నిలిపివేశారో అధికారికంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే వాట్సాప్ గ్రూపుల్లో ప్రొఫెసర్ వెంకటదాసు రాసిన కవిత్వ రూపంలోని కరపత్రం చర్చనీయాంశమైంది. దీనిపై స్పందించిన ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ "ఆ కరపత్రం ఆయన వ్యక్తిగత అభిప్రాయమే" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ సురేందర్, ప్రొఫెసర్లు వెంకటదాసు, మాధురి, సుజాత, రోజా రాణి, పద్మజ, గంగాధర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## కెపిహెచ్బి కాలనీ షిరిడి సాయిబాబా ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన సమారాధన కార్యక్రమం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కెపిహెచ్బి కాలనీ 2వ రోడ్ లో గల శ్రీశ్రీశ్రీ షిర్డి సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో శ్రీ సాయి మణికంఠ భక్త సమాజం వారు నిర్వహించిన మొదటి రోజు అయ్యప్ప స్వాముల అన్న సమారాధన కార్యక్రమమునకు నిర్వాహకులు యల్ . రాజ, యల్. నాగేశ్వర్రావు ఆహ్వానం మెరకు కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అయ్యప్పస్వామికి జరిగిన ప్రతేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ అన్నదానం అన్నది అత్యున్న తమైన దానం అన్నారు. భక్తి, సేవ, సమర్పణ ఈ మూడు మనిషిని దైవత్వం వైపు నడిపిస్తాయనీ అయ్యప్ప స్వామి కృపతో అందరికీ శాంతి, సౌఖ్యం కలగాలని కోరుకుంటున్నానని తెలిపి స్వాములతో కలిసి అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహకులు ప్రేమకుమార్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, దాసరి వెంకట్, పోలేబోయిన శ్రీనివాస్, వెంకట్, మండల రమేష్, పులగం సుబ్బు పాల్గొన్నారు.

## హెచ్‌ఎర్డీ జీఎంకు బహుమతిగా సీరత్ పుస్తకం

ఏ ఎం న్యూస్, 8 ఇంక్లైన్ కాలనీ :



సింగరేణి సంస్థ కార్పొరేట్ హెచ్ఆర్డీ జీఎంగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ మేరకు గురువారం ఆర్జీ-2 ఏరియా నిమ్ కార్యాలయమ్ లో వారిణి కలసి మానవుల మహొపకారీ మహా ప్రవక్త స లల్లాహు అలీహివ సల్లం సీరత్ స్పెషల్ ఎడిషన్ పుస్తకం ను ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ -వైస్ ప్రెసిడెంట్ -జమాత్ ఇ ఇస్లామీ హింద్- జాతీయ సంగం హింద్ మజ్దూర్ సభ కేంద్రం కార్యదర్శి -టెమ్రీస్ కౌన్సలర్స్ దంపతులు జ్ఞాపికను బహూకరిం చారు. అధ్యక్షుడు సయ్యద్ జావిద్ అక్మల్ హుస్సేని - డిప్యూటీ జనరల్ మేనేజర్, సింగరేణి అధికారులు కార్యక్రంలో పాల్గొన్నారు.



## అభివృద్ధి చేసి చూపిస్తా..

- జూబ్లీహిల్స్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డి

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక లో భాగంగా బుధవారం వెంగళరావునగర్ డివిజన్లోని( జూబ్లీహిల్స్ నియోజకవర్గం ) యాదగిరి నగర్ లో బిజెపి అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డి కి మద్దతుగా వారితో కలిసి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు పాదయాత్ర నిర్వహించారు వారితోపాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్ ,తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు ,వీరేందర్ గౌడ్ , మహిపాల్ రెడ్డి తో పాటు అట్లూరి రామకృష్ణ, కిలారి మనోహర్, తో పాటు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, పోలింగ్ బూత్ స్థాయి నాయకులు పాల్గొని లంకాల దీపక్ రెడ్డిని గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు ఈ సందర్భంగా దీపక్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లో అభివృద్ధి జరగలేదని, నన్ను గెలిపిస్తే అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని అన్నారు. యాదగిరి నగర్ లో ప్రజలు దీపక్ రెడ్డి కి పూల వర్షాన్ని కురిపించి స్వాగతించారు.

## సదర్ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అభ్యర్థి వి. నవీన్ యాదవ్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :





తెలంగాణ రాష్ట్రం బంజారాహిల్స్ దేవరకొండ బస్తీలో మల్లికార్జున్ యాదవ్ ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యాదవ సమాజ ప్రజలకు సదర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ ఉత్సవాలు మన యాదవ సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతానని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ యాదవ్ తో పాటు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

## కార్పొరేటర్ దొడ్లకు అంబేద్కర్ నగర్ వాసుల వినతి

ఏ ఎమ్ న్యూస్ శేర్లింగంపల్లి :



అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని అంబెద్కర్ నగర్ లో డ్రైనేజ్ మ్యాన్ హెూల్స్, మంజీరా వాటర్ కు సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పగిలిన మ్యాన్ హెూల్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటుచేస్తామని అన్నారు. అలాగే కాలనీలోని కొన్ని గల్లీలలో మంజీరా వాటర్ ప్రెజర్ రావడం లేదని కాలనీ వాసులు తెలుపగా, జల మండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బోయకిషన్, బప్పిరప్ప, మంగళి వెంకటేష్, రంగ స్వామి, రాజు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లి పాత శివాలయంలో కార్తీక మాసం ప్రారంభోత్సవ పూజలు చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




కార్తీక మాసం ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం కూకట్పల్లి పాత శివాలయములో కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు స్వామివారిని దర్శనము చేసుకొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు రాగి లక్ష్మారెడ్డి, రోజా దేవి రంగారావులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఎన్. శ్రీనివాసరావు (తులసి) మర్యాద అశోక్ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు స్వామివారని పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## యాదవ సోదరుల సదర్ ఉత్సవాలలో పాల్గొన్న పట్లోళ్ల నాగిరెడ్డి

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




కూకట్ పల్లి నియోజకవర్గం మూసపేట డివిజన్ లో యాదవ సోదరులు నిర్వహించిన సదర్ ఉత్సవాలకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి హాజరై మాట్లాడుతూ సదర్ ఉత్సవాలకు హాజరు కావడం చాలా సంతోషం పార్టీలకు ప్రాంతాలకు అతీతంగా అందరు కలిసి నిర్వహించడం చాలా మంది ప్రజలు పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమం లో భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి, వెంకటేష్ యాదవ్,బుచ్చిబాబు, రాజు, రాంబాబు, మహేష్, పాండు ముదిరాజు, ఎల్లేష్ యాదవ్, నరసింహ యాదవ్, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాగంటి సునీత గోపీనాథ్‌ని గెలిపించండి
### ఎల్.ఎన్,నగర్.లో ప్రచారం నిర్వహించిన వెంకటేష్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



వచ్చే నెల( నవంబర్2025) 11 జరిగే ఉప ఎన్నిక లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ భారతీయ రాష్ట్ర సమితి ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపే లక్ష్యంగా జనరల్ సెక్రెటరీ నర్సింగ్ దాస్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ స్థాయి ఓటర్ లను స్వయంగా కలిసి వారికి కరపత్రాలు పంచి మాగంటి సునీత ను గెలిపించాలని కోరారు ఎల్. నగర్.నివాసి బి.ఆర్. ఎస్. పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# గోపాల్ నగర్ యుఎల్సీ ప్లాట్స్ యజమానులకు న్యాయం చేయండి

### కూకట్పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతి పత్రం అందజేసిన ప్లాట్ ఓనర్స్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



గోపాల్ నగర్ యుఎల్సీ ప్లాట్స్ యజమానులు తమకు న్యాయం చేయాలని కోరుతూ కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఎవరి ఇళ్లను వారు కట్టుకొనే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎవరి బెదిరింపులకు లొంగకుండా తక్కువ పర్సంటేజీకి మీ ప్లాట్స్ ను అగ్రిమెంట్ చేసుకుని మోసపోకుండా మీ ఇళ్లను మీరే కట్టుకోవాలని మీకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా యు ఎల్ సి ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ గోపాల్ నగర్ కాలనీ పరిధిలో సుమారు పది ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యు ఎల్ సీ) కింద డిక్లేర్ చేసి అందులోని ప్లాట్లను ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ నిర్మాణాలను అడ్డుకుందనీ దీంతో దాదాపు ఇరవై ఏళ్లుగా కోర్ట్ కేసుల తరువాత హై కోర్టు వారు ప్రభుత్వ యు ఎల్ సి నోటిఫికేషన్ ఉత్తర్వులను రద్దు చేసి ప్లాట్ యజమానులకు అనుకూలంగా ఉత్తర్వులను జారీచేసింది అన్నారు. ఇంకా ప్రభుత్వ పరంగా మాకు ఎలాంటి అనుమతులు రాలేద నీ కనీసం రిజిస్ట్రే షన్ల ప్రక్రియను కూడా పునరుద్ధరించలేదు అన్నారు. అయితే ఇదే అదనుగా భావించిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పొలిటికల్ లీడర్లు, కొంతమంది దళారులు మా ప్లాట్ల యజమానులను ప్రలోభ పెడుతూ గ్రేటర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ పేరుతో యు ఎల్ సి సంబంధిత సమస్యలను తామే పరిష్కరిస్తామని తమకు డెవలప్మెంట్ అగ్రిమెంట్లు చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి ఇప్పటికే కొందరి వద్ద అగ్రిమెంట్లు కూడా చేసుకున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ పర్సంటేజ్ ఇస్తూ ప్రభుత్వ పరంగా చాలా సమస్యలు ఉన్నాయనీ అవన్నీ మేమే చూసుకుంటాము అంటూ నమ్మిస్తూ అగ్రిమెంట్లను చేసుకుంటున్నారనీ దాదాపు ఇరవై ఏళ్ల సుధీర్ఘ పోరాటం తరువాత మళ్లీ మా ఇళ్ల స్థలాలను వేరే వ్యక్తులకు అప్పగించడం ఇష్టం లేక మా స్థలంలో మేమే ఇళ్లను నిర్మించుకోవాలనే ఉద్దేశంతో ఉన్న మేమందరం మీ సహకారాన్ని కోరుకుంటున్నాం అని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. మా ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వ పరంగా సమస్యలు లేకుండా చూసి మాకు ఇంటి నిర్మాణ అనుమతులు, రిజిస్ట్రేషన్ల పరంగా సమస్యలు లేకుండా చూడగలరని కోరుతున్నామనీ తెలియజేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ప్లాట్ ఓనర్స్ మురళి, వెంకటరెడ్డి, రవి వర్మ, హనుమంతరావు, అనిల్, వెంకటేష్, గోపాల్ నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ధర్మారావు, సూరిబాబు, దొరబాబు, సురేష్ వర్మ, రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రామ్‌చరణ్‌తో జోడిగా కృతి సనన్!

### చాన్స్ ఇచ్చిన సుకుమార్..

ఇతర భాషల నుంచి చాలా మంది ముద్దుగుమ్మలు మన దగ్గరకు వచ్చి స్టార్స్ గా మారుతున్నారు. తెలుగు అమ్మాయిలకు మంచి అవకాశాలు వస్తున్నా కూడా ఇతర భాషల హీరోయిన్స్ మన దగ్గర స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. కన్నడ నుంచి వచ్చిన రష్మిక మందన్న తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. అలాగే హిందీ నుంచి వచ్చిన మృణాల్ మన దగ్గర టాప్ హీరోయిన్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది పేర్లు లిస్ట్ లో ఉంటాయి. అయితే ఇతర భాషల నుంచి వచ్చిన అందరు హీరోయిన్స్ సక్సెస్ అవ్వరూ.. కొంతమంది మాత్రం బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ అందుకుంటూ ఉంటారు. దాంతో తిరిగి తమ ఇండస్ట్రీకి చెక్కేస్తుంటారు. అలానే ఓ అమ్మడు తెలుగులో రెండు సినిమాలు చేసింది. రెండు పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో డిజాస్టర్ అందుకుంది.. బాలీవుడ్ లోనూ పెద్దగా హిట్స్ లేవు. అయినా కూడా ఇప్పుడు ఓ బడా హీరో పిలిచి మరి ఛాన్స్ ఇచ్చాడు ఆ అమ్మడికి.. ఇంతకూ ఆమె ఎవరో కాదు.. బాలీవుడ్ పొడుగుకాళ్ల సుందరి కృతి సనన్. బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ గురించి చెప్పక్కర్లేదు. ఇప్పుడు హిందీలో సెటిల్ అయిన భామ.. ముందుగా తెలుగులోనే నటించింది. మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన 1 నేనొక్కడినే చిత్రంతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత నాగచైతన్యతో కలిసి దోచేయ్ అనే సినిమా చేసింది. ఈ సినిమా డిజాస్టర్ అవ్వడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడే వరుస సినిమాల్లో నటిస్తుంది. మొన్నామధ్య ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ అనే సినిమా చేసింది. రామాయణం నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా డబుల్ డిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడికి సుకుమార్ ఛాన్స్ ఇచ్చారని తెలుస్తుంది. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాలో కృతి సనన్ హీరోయిన్ గా నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. గతంలో సుకుమార్ తెరకెక్కించిన వన్ నేనొక్కడినే సినిమాలో కృతి హీరోయిన్ గా చేసింది. ఇప్పుడు మరోసారి ఆమెకు సుక్కు ఛాన్స్ ఇచ్చాడని తెలుస్తుంది.



# స్పీడ్ పెంచిన శ్రీనిధి శెట్టి



టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని చిత్ర నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాలో కథానాయిక విషయంలో శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా అంటూ పలువురి పేర్లు తెర మీదకు వచ్చినా చివరకు కన్నడ నటి శ్రీనిధి శెట్టిని ఫైనల్ చేశారు. తాజాగా మంగళవారం శ్రీనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని మేకర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే ఈ ఏడాది హిట్3 చిత్రంతో మంచి విజయం రుచి చూసిన శ్రీనిధి దీపావళికి తెలుసు కదా అనే సెన్సిబుల్ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగానే విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ వంటి అగ్ర స్థాయి టీమ్‌తో పని చేసే ఛాన్స్ దక్కడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుంగా పోయాయి. ఇప్పుడు ఈ చిత్రమే కాకుండా తమిళంతో అజిత్‌తో ఒకటి తెలుగులో మరో రెండు సినిమాలు సైతం అమ్మడి చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. ఇప్పటికే వెంకటేశ్ సూపర్ హిట్ చిత్రాలు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. దీంతో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా తమన్ కాకుండా యానిమల్ ఫేం హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండడం విశేషం. కాగా ఈ మూవీ 2026 వేసవిలో ప్రేక్షకుల ఎదుటకు వచ్చే అవకాశం ఉంది.

# బాలీవుడ్‌లో బిజీగా మారిన శ్రీలీల



పైకి ఖాళీగా ఉన్నట్లే కనిపిస్తుంది కానీ నిజానికి చాలా బిజీగా ఉన్నారు శ్రీలీల. అస్సలు ఖాళీ లేకుండా ఉన్నారీ భామ. ఓవైపు టాలీవుడ్.. మరోవైపు బాలీవుడ్.. ఇంకోవైపు కోలీవుడ్.. అన్ని ఉడ్లలో మోస్ట్ వాంటెడ్ అయిపోతున్నారు శ్రీలీల. ముఖ్యంగా ముంబై నుంచి అమ్మడికి అదిరిపోయే అవకాశాలు వస్తున్నాయి. ఆల్రెడీ కార్తిక్ ఆర్యన్ హీరోగా శ్రీలీల హిందీలో డెబ్యూ చేస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ వేగంగా జరుగుతుంది. 2026 ఫస్టాఫ్‌లో విడుదల కానుంది ఈ చిత్రం. ఇది సెట్స్‌పై ఉండగానే.. మరో రెండు మూడు ఆఫర్స్ శ్రీలీల ఖాతాలో చేరిపోయేలా ఉన్నాయి. మరోవైపు రణ్‌వీర్ సింగ్‌తో అట్లీ దర్శకత్వంలో ఓ యాడ్ చేసారు శ్రీలీల. దీన్ని ఏకంగా ఓ సినిమా రేంజ్‌లో తెరకెక్కించారు అట్లీ. తెలుగులోనూ ఫుల్ బిజీగా ఉన్నారు శ్రీలీల. ఇప్పటికే పవన్‌తో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ షూట్ పూర్తి కాగా.. మాస్ జాతర అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ రెండింటి తర్వాత శ్రీలీల తెలుగులో గ్యాప్ తీసుకుంటున్నారు. మరోవైపు తమిళంలో పొంగల్‌కు పరాశక్తితో రాబోతున్నారు. మూడు ఇండస్ట్రీలను కవర్ చేస్తూ సూపర్ బిజీ అయిపోయారు ఈ బ్యూటీ. వరస సినిమాలైతే చేస్తున్నారు కానీ విజయాల విషయంలో మాత్రం కాస్త వెనకబడ్డారు శ్రీలీల. చివరగా గుంటూరు కారం పర్లేదనిపిస్తే.. భగవంత్ కేసరి హిట్ లిస్టులో చేరింది. ఆ తర్వాత పుష్ప 2లో కిస్ కిస్ కిసిక్ పాటతో దేశాన్ని ఊపేసారు ఈ బ్యూటీ. ఇప్పుడు మళ్లీ జోరు పెంచేస్తున్నారు. మరి ఇందులో ఆమె కోరుకున్న విజయం ఏ ఇండస్ట్రీ నుంచి వస్తుందో చూడాలి.

# రమ్యకృష్ణకు అంతమంది లైన్ వేశారా?

తెలుగు, తమిళ ఇండస్ట్రీల్లో స్ట్రాంగ్ ఉమెన్ క్యారెక్టర్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన హీరోయిన్ రమ్యకృష్ణ . ఇటీవల జీ తెలుగు షో జయమ్ము నిశ్చయమ్మురాలో సందడి చేసింది. గ్లామర్ హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన రమ్యకృష్ణ, రాఘవేంద్రరావు దర్శకత్వంలో వరుసగా సినిమాలు చేసి స్టార్ స్టేటస్ దక్కించుకుంది. ఇక బాహుబలిలో శివగామి పాత్ర ద్వారా కెరీర్‌లో మరో మెట్టు ఎక్కిన విషయం తెలిసిందే. తాజాగా జగపతి బాబు షోకి హాజరైన రమ్యకృష్ణ ఆసక్తికర కామెంట్స్ చేసింది. అయితే రమ్యకృష్ణ ఎంట్రీతో షో హోస్ట్ జగపతిబాబు కుర్రాడిలా మారి, స్టైలిష్‌గా ప్రవర్తించడం, టీషర్ట్‌లో యంగ్ లుక్‌లో కనిపించడం, స్టెప్పులేసి రమ్యకృష్ణని ఇంప్రెస్ చేసుకోవడానికి ప్రయత్నించడం హైలైట్‌గా నిలిచింది. రమ్యకృష్ణ, తన ఫన్నీ ఎక్స్‌ప్రెషన్స్‌తో జగపతిబాబును కవర్ చేయడం, కౌంటర్ ఇచ్చి షోను మరింత ఆసక్తికరంగా మార్చడం ప్రేక్షకులను అలరించింది.మొత్తంగా రమ్యకృష్ణ, జగపతిబాబు మధ్య ఫన్నీ కౌంటర్ డైలాగ్స్, ఎంటర్టైనింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌లు షోను సక్సెస్‌ఫుల్‌గా మార్చనున్నాయి.'నీకు చిన్నప్పట్నుంచి చాలా మంది సైట్ కొట్టడం, ప్రేమించడం, పడి దొర్లడం.. అని జగపతిబాబు చెబుతుండగానే .. 'ఇన్‌క్లూడింగ్ యూ(నువ్వు కూడా) అంటూ జగ్గు బాయ్ ముఖం మీదే నవ్వుతూ చెప్పేసింది. దీనికి జగపతి బాబు కూడా స్మైలింగ్ ఎక్స్ ప్రెషన్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రోమోలు నెట్టింట వైరలవుతున్నాయి. కాగా, రమ్యకృష్ణ పాజిటివ్, నెగటివ్ పాత్రలలో ఆకట్టుకుంటూ ఉంటే, జగపతిబాబు కూడా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పవర్‌ఫుల్ రోల్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇలాంటి ఎంటర్‌టైనింగ్ కంటెంట్, బలమైన పాత్రల కలయిక, ప్రేక్షకుల మన్ననలు రమ్యకృష్ణ, జగపతిబాబులని టాప్ ఫేవరేట్స్‌గా నిలబెట్టింది. జగపతిబాబు, రమ్యకృష్ణ కలిసి పలు సినిమాల్లో నటించారు. ఆయనకు ఇద్దరు, బడ్జెట్ పద్మనాభం తదితర చిత్రాల్లో హీరో, హీరోయిన్లుగా నటించారు. ఇక జగపతి బాబు ప్రస్తుతం విలన్ గా, సహాయక నటుడిగా రాణిస్తున్నారు. అలాగే టీవీ షోలకు హోస్ట్ గా వ్యవహరిస్తున్నారు.



## Mana Cinemalu

### మొదటి రోజు థామా కలెక్షన్లు ఎంతో తెలుసా?





నేషనల్ క్రష్ రష్మిక మందన, బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఆదిత్య సర్పోదర్ రూపొందించిన హారర్ కామెడీ చిత్రం 'థామా'. ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ దక్కించుకున్న ఈ చిత్రం మంచి వసూళ్లను రాబడుతుంది. ఈ చిత్రం తొలిరోజే రూ. 25.11 కోట్ల వసూళ్లు రాబట్టినట్లు చిత్ర బృందం ప్రకటించింది. అంతేగాకుండా ఆయుష్మాన్ ఖురానా కెరీర్‌లో మొదటిరోజు ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన మొదటి చిత్రంగా 'థామా' చిత్రం నిలిచింది. మరోవైపు వీకెండ్ వస్తుండటంతో ఈ కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సినిమాను మాడాక్ ఫిల్మ్స్ నిర్మించింది.

### ఆర్‌టీ76తో వస్తున్న మాస్‌మహారాజ్ రవితేజ






అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయాడు. ఇప్పటికే భాను భోగవరపు దర్శకత్వంలో నటిస్తోన్న మాస్ జాతర సినిమా అక్టోబర్ 31న విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ కూడా కొనసాగుతున్నాయి. కాగా ఈ సినిమా రీలీజ్ కాకముందే రవితేజ కొత్త సినిమా వార్త నెట్టింట వైరల్ అవుతోంది. కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఆర్‌టీ76. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ అప్‌డేట్ షేర్ చేసి మూవీ లవర్స్, అభిమానుల్లో జోష్ నింపుతోంది ఆషికా రంగనాథ్. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ స్పెయిన్‌లో కొనసాగుతోంది. స్పెయిన్‌లో సాంగ్ షూట్ పూర్తయిన సంబంధించిన విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ షూట్‌తో స్పెయిన్ షెడ్యూల్ కూడా పూర్తయినట్టు తెలిపింది. రవితేజ్ అండ్ టీం త్వరలోనే ఇండియాకు తిరిగిరానుంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ ప్రాజెక్టు 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఇండియాకు తిరిగిరాగానే మాస్ జాతర ప్రమోషన్స్‌తో బిజీ కానున్నాడు రవితేజ. ఈ చిత్రలో రవితేజ రైల్వే పోలీసాఫీసర్‌గా సందడి చేయబోతున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్ నీ చిత్రంలో రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు.

### కలెక్షన్లు రాబడుతున్న డ్యూడ్



కొన్ని కాంబినేషన్ల కోసం చాలా సందర్భాల్లో ముమ్మరంగా ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ, అనుకున్నప్పుడు వర్కవుట్ కావు. కానీ, అనుకోని సందర్భాల్లో స్క్రీన్ మీద తళుక్కుమంటాయి. అలాంటి కాంబో డ్యూడ్ మూవీకి కుదిరిందని అంటున్నారు ప్రదీప్ రంగనాథన్. ఆయన హీరోగా నటించిన సినిమా 'డ్యూడ్'. మమిత బైజు హీరోయిన్‌గా నటించారు. ”డ్యూడ్‌లో నేను చేసిన కేరక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. అసలు ఇలాంటి రోల్ కెరీర్లో ఇంత ఎర్లీ స్టేజ్‌లో చేస్తానని నేను ఊహించనేలేదు. అందుకే ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. డైలాగులు కూడా రాత్రుళ్లు ఇంటికి తీసుకెళ్లి బట్టీపట్టేదాన్ని. నిద్రపోకుండా ప్రాక్టీస్ చేసేదాన్ని. లైన్స్ గుర్తుంటే కెమెరా ముందు ఎంతైనా ఎమోషన్స్ పండించడానికి వెసులుబాటు ఉంటుంది. ఆ విషయం డ్యూడ్‌తో నాకు బాగా తెలిసొచ్చింది. ఫ్యూచర్‌లోనూ ఇలాంటి కేరక్టర్లు వచ్చినప్పుడు ఈ ప్రాక్టీస్ ఉపయోగపడుతుంది” అని అన్నారు మమిత. అసలు మమితతో తనకున్న అనుబంధం గురించి చెప్పుకొచ్చారు ప్రదీప్ రంగనాథన్. ”మమిత సినిమాల్లోకి రాకముందు ఓ షార్ట్ ఫిల్మ్ లో నటించారు. ఆమె అప్పడాన్ని విరగ్గొట్టి తినే సీన్ నాకు చాలా బాగా నచ్చింది. నేను సినిమా చేసేటప్పుడు మమితను తీసుకోవాలనుకున్నా. కానీ ఆ సమయంలో వనంగాన్‌కి డేట్స్ ఇచ్చారు మమిత. (సూర్య చేయాల్సిన సినిమా వనంగాన్.. స్టార్ట్ కాకముందే ఆగిపోయింది. సూర్య ప్లేస్‌లో మరో హీరో చేశారు. సూర్యని అనుకున్నప్పుడు మమితను అనుకున్నారు. ఆ తర్వాత ఈక్వేషన్స్ మారిపోయాయి). అరే.. మంచి పెర్ఫార్మర్‌ని మిస్ అయ్యామే అనుకున్నా. కానీ డ్యూడ్ చేసే సమయంలో మమిత బైజును హీరోయిన్‌గా అనుకుంటున్నట్టు డైరక్టర్ చెప్పారు. వినగానే నాకు అప్పటిదాకా జరిగిందంతా కళ్ల ముందు తిరిగింది” అని అన్నారు ప్రదీప్ రంగనాథన్. ఈ దీపావళికి విడుదలైన డ్యూడ్ మూవీ సూపర్ హిట్ టాక్ తో దూసుకుపోతుంది. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తుంది. మరోవైపు భారీగా కలెక్షన్స్ కొల్లగొడుతుంది. ఈ చిత్రంలో మమితా, ప్రదీప్ జంటగా నటించిన సంగతి తెలిసిందే.